

పడిలేచిన కెరటం!



ఐక్యతతో కదిలివచ్చిన పసుపుదళం

అండగా నిలిచిన జనసేన, బీజేపీ

అరాచక వైసీపీపై అద్భుత పోరాటం

అఖండ విజయంతో అధికారం కైవసం

హిందూపురం, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల ఫలితాల వేళ ఐదేళ్ల జిల్లా రాజకీయ ముఖచిత్రం ఒక్కసారిగా తల్లకిందులైంది. తెలుగుదేశం పార్టీ 2019 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో రెండు స్థానాలకే పరిమితమైంది. ఈసారి అధికార పక్షంగా బరిలోకి దిగిన వైసీపీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులు అఖండ విజయం సొంతం చేసుకున్నారు. ఇదంతా ఒకరోజు, ఒక నెలలో జరిగిపోలేదు. దీనివెనుక కూటమి శ్రేణుల నిరంతర శ్రమ దాగి ఉంది. మొన్నటివరకు అధికారంలో ఉన్న వైసీపీ అతి విశ్వాసం, పాలన వైఫల్యాలు, అరాచకాలు, భూదందాలు, అఘాయిత్యాలు, హత్యలు, అత్యాచారాలు, ముఖ్యంగా వర్గపోరు, అన్నింటికీ మించి శాంతిభద్రతల సమస్యలతో అథంపాతాళానికి పడిపోయింది. ఇంత వ్యతిరేకత ఉన్నా పసిగట్టలేకపోయింది. జిల్లాలో వైసీపీకి అధికారం వచ్చాక అదంతా తమ సొంతబలమనీ, అధికారం శాశ్వతంగా ఉంటుందని భ్రమలోపడి నియోజకవర్గ నేతలు రెచ్చిపోయారు. మితిమీరిన ప్రచారార్భాటం తమను తాము అతిగా ఊహించుకునేలా చేసింది. సొంత మనుషులు చెప్పిన విధంగా ఐప్యాక్ బృందాలు.. నేతలను నియంత్రించి నడిపించేలా ఉండటంతో కొన్నిసార్లు వైసీపీ నేతలు క్షేత్రస్థాయిలో పరిస్థితులకు అనుగుణంగా వెళ్లలేకపోయారు. సంక్షేమం ప్రతి ఇంటికీ చేరుతోందని భావించి ఎవరూ ఎదురు మాట్లాడకపోతుండటంతో ప్రజలంతా తమవైపే ఉన్నా

వైసీపీ పాలనలో జగన్ ప్రైవేటు సైన్యంలా వలంటీరు వ్యవస్థను తీసుకొచ్చారు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల మాటలు వినకుండా వారికి నచ్చినట్లు క్షేత్రస్థాయిలో సామాన్యులను ఒక ఆటాడుకున్నారు. వలంటీర్లు మొదలుకుని ముఖ్యమంత్రి వరకు అలాగే ఉండటంతో చేసేదిలేక పసుపుదళం ఐక్యతతో ముందుకు కదిలింది. జనసేన పార్టీ చేయి కలపడంతో బలం మరింత పెరిగింది. ఇరుపార్టీలు ముందుకు కదిలాయి. ఎన్నికలకు ముందు బీజేపీతో పొత్తు పెట్టుకోవడంతో కూటమి ఏర్పడింది. వైసీపీ పాలనపై శంఖం పూరించి, ఐదేళ్లలో పార్టీచేసిన నష్టాన్ని అరాచకాలు, ప్రజలకు వివరించారు.

> ఐక్యతతో కదిలొచ్చిన పసుపుదళం

రని భ్రమలో గడిపేశారు. ప్రశ్నించేవారిపై కక్షసాధింపులు, ఎదురు తిరిగితే అక్రమ కేసులు, నిలదీస్తే దాడులు చేయించడం ఐదేళ్లలో పరిపాటిగా మారింది. దీంతో సామాన్యులు మరింత దూరమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలెక్టెడ్ పద్ధతిలో కాకుండా సెలెక్టడ్ స్థాయికి ప్రతిపక్షాలను తొక్కేసి, అఖండ మెజార్టీ సాధించామనీ, ఇక ఎదురులేదని వైసీపీ నేతలు పాలన సాగించారు. క్షేత్రస్థాయిలో తమ బలమెంతో, కిందిస్థాయి నాయకులు చేస్తున్నదేంటో గుర్తించలేక ఇప్పుడు నోరు వెళ్లబెట్టుకుంటున్నారు. ఈ కారణంగా పార్టీకి తీరని నష్టం వాటిల్లింది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీలో అసంతృప్తి జ్వాలను చల్లార్చే బాధ్యత తీసుకునే వ్యవస్థ లేకపోవడం, జనాలకు ముఖ్యమంత్రి దూరంగా ఉండటం, ఎమ్మెల్యే ఎంపీలను దగ్గరకు రాకుండా చూడటంతో నేడు ఆ పార్టీ కొన్ని జిల్లాల్లో ఖాతాకూడా తెరవలేకపోయింది.

ఓటమి నేర్పిన పాఠాలు



టీడీపీ 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి నుంచి త్వరితగతిన కోలుకుంది. ఓటమికి కారణాలను విశ్లేషించుకుంది. అధినేత చంద్రబాబు సూచనలతో ప్రజాపోరాటాలకు వేగంగా రంగంలోకి దిగింది. టీడీపీ ఏర్పడి 40 ఏళ్లు పూర్తయిన సందున పార్టీ నిర్మాణంలో యువతను భాగస్వామ్యులు చేసింది. కొత్త నాయకత్వాన్ని అన్నిచోట్లా ప్రోత్సహించింది. బూత్‌స్థాయి నుంచి యువతకు, సామాజికవర్గాల వారీగా శ్రేణులకు అవకాశం కల్పించింది. ప్రతిబూత్‌స్థాయిలో 30 నుంచి 50 మంది వరకు పార్టీ కార్యకలాపాల్లో భాగస్వాములను చేసింది. పార్టీ కార్యక్రమాలను సంఘటితంగా ముందుకు తీసుకెళ్లడాన్ని టీడీపీ శ్రేణులు సవాల్‌గా తీసుకుని, పనిచేశాయి. స్థానిక ఎన్నికల బహిష్కరణ తరువాత నేతల్లో నైరాశ్యం నెలకొన్నప్పటికీ దాని నుంచి వెనువెంటనే బయటకు వచ్చారు. గ్రామస్థాయిలో అధికార పార్టీ నుంచి ఎదురవుతున్న ఒత్తిళ్లు, అవమానాలు, ఇబ్బందులు, అక్రమాలు, దందాలు, దౌర్జన్యాలు, టీడీపీ శ్రేణులు ఏకమై ఎదుర్కొనేందుకు నియోజకవర్గ స్థాయి నేతలు ముందుకొచ్చారు. జిల్లాలో ఎక్కడ, ఏ ఘటన జరిగినా పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు హాజరై, అండగా నిలిచారు. ఎన్నికల ఏడాది బాదుడే బాదుడు, ఇదేం ఖర్మ రాష్ట్రానికి, సూపర్‌సిక్స్ కార్యక్రమాలతోపాటు యువనేత నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును వైసీపీ ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్‌చేసి 52 రోజులపాటు జైలులో నిర్బంధించింది. ఈ సందర్భంగా జిల్లానేకాదు రాష్ట్ర, దేశవిదేశాల్లో ఉన్న టీడీపీ శ్రేణులు, తెలుగువారు, ఉద్యోగులు, జనసైనికులు, 52 రోజులు ఎక్కడికక్కడ నిరసనలు, ర్యాలీలు చేపట్టారు. ఓ రకంగా చెప్పాలంటే 2013లో సమైక్యాంధ్ర ఉద్యమం తరువాత రాష్ట్రంలో అన్నిరోజులపాటు ఓ రాజకీయ నాయకుడి కోసం రోడ్డెక్కిన ఘటన చరిత్రలో ఇదేనని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. సాధారణంగా రాజకీయ నాయకులను ఆరోపణలపై అరెస్టు చేస్తే ఒకట్రెండు రోజుల్లో మరిచిపోతారు. చంద్రబాబును అరెస్టు చేశాక రోజురోజుకీ ఆయనకు మద్దతు పెరిగింది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అన్ని కుల, మతాలవారు ఆయనకు సంఘీభావం తెలిపారు. దీంతో చంద్రబాబు జైలు నుంచి బయటకు వచ్చిన కొన్నిరోజులకే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. ఇలా ఏడాదంతా టీడీపీ శ్రేణులు పార్టీకోసమే నిత్యం పనిచేశాయని చెప్పవచ్చు. 2019 ఎన్నికల అనంతరం వైసీపీ ప్రభుత్వం, ఆ పార్టీ నాయకులు.. టీడీపీ శ్రేణులపై చేసిన దాడులు, అవమానాలు, అసెంబ్లీలో చంద్రబాబును వైసీపీ మంత్రులు అవమానించిన తీరు ప్రతి టీడీపీ నాయకుడిని కలచివేసింది. ఎలాగైనా 2024లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా చూడాలని తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రతి నాయకుడు, కార్యకర్త శపథం చేశారు. టీడీపీ సభ్యత్వ నమోదు అంశాలతో ప్రతి ఇంటికీ పలుమార్లు సందర్శించారు. వారి ఆలోచనలను ప్రాధాన్యతలను పరిశీలించి, వారితో మమేకమయ్యారు. ఇలా ప్రజలు, పార్టీ నాయకత్వం సమన్వయంగా కలిసి రావడంతో గట్టి ఓటమి నుంచి బలమైన విజయంవైపు దూసుకెళ్లారని చెప్పవచ్చు.

వాన వెల్లువ

జిల్లావ్యాప్తంగా దంచికొట్టిన వర్షం



మడకశిర మండలం గుద్దిలిపల్లి వద్ద పొంగి ప్రవహిస్తున్న చెక్ డ్యాం

పుట్టపర్తి రూరల్, జూన్ 7: జిల్లావ్యాప్తంగా వానలు దంచి కొడుతున్నాయి. దాదాపు అన్ని మండలాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు ఉప్పొంగుతున్నాయి. చెక్‌డ్యాంలు నిండి, పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులకు పెద్దఎత్తున నీరు చేరుతోంది. దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

తనకల్లులో 72.4 మి.మీ. వర్షం

పలు మండలాల్లో వర్షం జిల్లావ్యాప్తంగా గురువారం రాత్రి పలుచోట్ల వర్షం దంచికొట్టింది. అత్యధికంగా తనకల్లులో 72.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు పేర్కొన్నారు. నల్లచెరువు 70.2, బత్తలపల్లి 68.4, నల్లమాడ 62.2, సోమందేపల్లి 56.8, అమరాపురం 48.4, ఓబుళదేవరచెరువు 45.2, నంబుల పూలకుంట 37.4, రొద్దం 32.6, అమడగూరు 27.0, కొత్తచెరువు 25.8, కనగానిపల్లి 25.8, గోరంట్ల 22.2, చెన్నేకొత్తపల్లి 20.8, పెనుకొండ 20.8, బుక్కపట్నం 20.6, కదిరి 16.2, తలుపుల 12.4, పుట్టపర్తి 10.8, గాండ్లపెంట 10.4, అగళి 10.2, మడకశిర 9.6, ధర్మవరం 8.2, చిలమత్తూరు 8.2, గుడిబండ 6.4, లేపాక్షి 6.2, రామగిరి 5.8, ముదిగుబ్బ 5.2, హిందూపురం 4.8, పరిగి 4.2, రొళ్ల 2.2, తాడిమర్రిలో 1.8మి.మీ. వర్షం కురిసినట్లు వాతావరణ శాఖాధికారులు వెల్లడించారు.

శుక్రవారం కూడా..

పుట్టపర్తిలో శుక్రవారం ఉదయం నుంచే వర్షం కురుస్తుండటంతో రోడ్లు జలమయమయ్యాయి. హిందూపురం, పెనుకొండలో వర్షం కురిసింది.



సోమందేపల్లి మండలం వెలుగమాకులపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వంక



ఓబుళదేవర చెరువులో వర్షానికి కూలిన షెడ్డు



రైల్వే అండర్‌బ్రిడ్జి కింద వర్షపునీరు చేరడంతో గురువారం ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

సత్య పరిష్కారం..!




పనులు చేయడంతో బ్రిడ్జి కింద ఖాళీ అయిన వర్షపునీరు

రైల్వే అండర్ బ్రిడ్జి సమస్యపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే

యుద్ధప్రాతిపదికన నీటి మళ్లింపు చర్యలు

ధర్మవరం, జూన్ 7: పట్టణంలోని గాంధీనగర్ రైల్వే అండర్ బ్రిడ్జి సమస్యపై ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ వెంటనే స్పందించారు. గురువారం కురిసిన భారీ వర్షానికి బ్రిడ్జి కింద భారీగా నీరు చేరి, వాహన రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఓ బస్సు చిక్కుకుంది కూడా. దానిని మరో వాహనం సాయంతో బయటకు లాగారు. సమస్య ఢిల్లీ పర్యటనలో ఉన్న సత్యకుమార్ దృష్టికి వెళ్లింది. ఆయన వెంటనే స్పందించారు. సంబంధిత రైల్వే అధికారులతో మాట్లాడారు. ప్రస్తుతానికి బ్రిడ్జి కింద చేరిన నీటిని తొలగించి, శుభ్రం చేయాల్సిందిగా ధర్మవరం మున్సిపల్ కమిషనర్ రాంకుమార్‌ను ఆదేశించారు. దీంతో యుద్ధ ప్రాతిపదికన బ్రిడ్జి కింద నీటి తొలగింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం బ్రిడ్జి సైడ్‌వాల్‌ను ధ్వంసం చేసి కాలువ తవ్వి, దాని ద్వారా నీటిని సమీపంలోనే ఉన్న మురుగు కాలువలోకి కలిపారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిలేకుండా పోయింది. ఇది తాత్కాలికమేననీ, త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే ప్రకటన ద్వారా తెలిపారు.



ఊపిరిపీల్చుకున్న ఉద్యోగులు

రియల్టర్లలో ఆనందం

తలలు తీస్తామన్న నాయకులు అజ్ఞాతంలోకి..



పెనుకొండ టౌన్, జూన్ 7: వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ ఓటమిపై పెనుకొండలో అన్నివర్గాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హమ్మయ్య.. ఓడిపోయారా.. అంటూ ఉపశమనం పొందుతున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో కళ్యాణదుర్గం నుంచి గెలుపొందిన ఉషశ్రీ తర్వాత మంత్రి అయ్యారు. ఎన్నో అరాచకాలు, కబ్జాలు చేశారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. దీంతో అక్కడి ప్రజలు ఆమె తీరుతో విసిగిపోయారన్న వాదనలున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల ఎన్నికలకు ముందు వైసీపీ నాయకుల బదిలీల్లో భాగంగా ఉషశ్రీ పెనుకొండకు వచ్చారు. ఆమె అరాచకాలను పెనుకొండ నాయకులు కథలుకథలుగా చెబుతుండడంతో పెనుకొండ వాసుల్లో కూడా ఆందోళన నెలకొంది. ఊహించిన దానికి మించి ఆమె చెలరేగిపోయారు. అధికారులపై ఒత్తిళ్లు, వేధింపులతో విరుచుకుపడ్డారు. వచ్చేది తమ ప్రభుత్వమేననీ, మాట వినకుంటే కథ తేలుస్తానంటూ బెదిరింపులకు దిగినట్లు ఆరోపణలున్నాయి. వెంచర్లు వేసిన రియల్టర్లకు కూడా వేధింపులు తప్పలేదు. పర్సెంటేజీలు, అడిగినన్ని ప్లాట్లు ఇవ్వాల్సిందేనని హుకుం జారీ చేశారు. తాను చెప్పేవరకు లేఔట్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేయవద్దని అనధికార ఆదేశాలిచ్చినట్లు తెలిసింది. దీంతో పెనుకొండ వాసుల్లో ఆందోళన ఏర్పడింది. ఇలాంటి ప్రజాప్రతినిధిని ఎన్నడూ చూడలేదని వాపోయారు. ఆమె ఎమ్మెల్యేగా గెలిస్తే తమ పరిస్థితి ఏంటని భయాందోళనలు చెందారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో ఆమె ఓడిపోవడం, కౌంటింగ్ కొనసాగుతుండగానే పెనుకొండను వీడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఉషశ్రీ పెనుకొండకు వచ్చీరాగానే నగర పంచాయతీ, రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, తదితర అధికారులపై పెత్తనం చెలాయించడం మొదలెట్టారు. తన ఆధీనంలోకి రావాలని హుకుం జారీ చేశారు. ఎన్నికల కోడ్ ఉన్నా.. అధికారులను ఇంటికి పిలిపించి మరీ హెచ్చరికలు జారీ చేశారు. తాను పెనుకొండలో గెలిచినా, గెలవకపోయినా అధికారం మాత్రం తమ పార్టీదేననీ, అంతు చూస్తానని ఘాటుగా హెచ్చరించినట్లు విమర్శలున్నాయి. అధికారులు చేసేదిలేక మౌనంగా ఉండిపోయారు. సార్వత్రిక ఎన్నిల్లో ఉషశ్రీ ఓడిపోవడంతో అధికారుల సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి.

బై.. బై.. ఉష..!

ఉషశ్రీ ఓటమితో పెనుకొండలో ప్రశాంతత

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బెదిరింపులు



గతంలో పనిచేసిన సబ్ రిజిస్ట్రార్‌కు ఉషశ్రీ కార్యాలయం నుంచి బెదిరింపులు వచ్చినట్లు తెలుస్తోంది. అక్రమ రిజిస్ట్రేషన్లు చేయాలనీ, మామూళ్లు ముట్టజెప్పాలని హుకుం జారీ చేసినట్లు సమాచారం. ఒత్తిళ్లు భరించలేక ఆయన సెలవుపెట్టి వెళ్లిపోయారు. అనంతరం వచ్చిన సబ్‌రిజిస్ట్రార్‌ను కూడా అదే తరహాలో ఉషశ్రీ పీఏలు ఫోన్‌లో హెచ్చరించారు. పెనుకొండ ప్రాంతంలోని లేఔట్లలోని స్థలాల రిజిస్ట్రేషన్ చేయకూడదనీ, సర్వే నంబర్లతో సహా సబ్‌రిజిస్ట్రార్‌కు అందజేశారు. చేసేదిలేక అధికారులు సాకులు చెప్పి, రిజిస్ట్రేషన్లు నిలిపేశారు. ఉషశ్రీ ఓటమితో ఆ కార్యాలయంలో గోప్యంగా సంబరాలు చేసుకుంటున్నారని తెలిసింది.

రెవెన్యూ అధికారులు, కమిషనర్‌పై పెత్తనం

తన మాట వినాలనీ, లేదంటే వేటు తప్పదని తహసీల్దార్, నగర పంచాయతీ కమిషనర్‌పై ఉషశ్రీ ఆగ్రహం వ్యక్తంచేసినట్లు సమాచారం. అప్పట్లో ఆమె చేసిన హెచ్చరికలపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది. సమన్వయంతో అధికారులతో పనిచేయించుకోవాలే తప్ప. ఇలా బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తే ఇలా పాతాళంలోకి పడిపోక తప్పదంటున్నారు.

రియల్టర్లలో ఆనందం

మాజీ మంత్రి ఉషశ్రీ పెనుకొండకు రాగానే ఆమె కన్ను భూముపై పడింది. రియల్టర్లను తన అనుచరుల ద్వారా బెదిరించారన్న అపవాదు ఉంది. ఈ క్రమంలో ఈమె పెనుకొండలో గెలిస్తే తమ పెట్టుబడులకు గ్యారెంటీ ఉండదని డీలా పడ్డారు. కొందరు ముడుపులు ముట్టజెప్పారు. ఎట్టకేలకు ఎమ్మెల్యేగా సవిత గెలవడంతో రియల్టర్ల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఉషశ్రీ పెనుకొండకు వచ్చినప్పట్నుంచి సొంత డబ్బుతో ప్రచారాలు చేశామనీ, కౌంటింగ్ తరువాత తమను పలకరించే వారే లేరని వైసీపీ స్థానిక నాయకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వలస నాయకులతోనే ఈ సమస్య వస్తోందని వాపోతున్నారు.

వారు ఏరీ?



అధికారం ఉందికదా అని గతంలో వైసీపీ నాయకులు విర్రవీగారు. పెనుకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో టీడీపీ ఎమ్మెల్యే భర్తపై దురుసుగా ప్రవర్తించారు. అక్కడితో ఆగకుండా తమకు అడ్డు వస్తే తలలు తీస్తామంటూ పోలీసుల సమక్షంలో బెదిరించారు కూడా. వారంతా టీడీపీ గెలుపుతో అజ్ఞాతంలోకి వెళ్లారు. మరికొందరు ఇంటికే పరిమితమయ్యారు. విర్రవీగడం ఎందుకు.. ఇలా అజ్ఞాతంలోకి వెళ్లడం ఎందుకని ప్రజలు అంటున్నారు.

చిగిచెర్ల వద్ద పొలాల్లో అన్వేషణ

వర్షం రాకతో తండోపతండాలుగా వస్తున్న జనాలు



చిగిచెర్ల వద్ద వజ్రాల కోసం అన్వేషిస్తున్న ప్రజలు

వజ్రాల వేట..



వజ్రాలను వెతుకుతున్న మహిళలు

ధర్మవరంరూరల్, జూన్7: వజ్రకరూరు, కర్నూలు జిల్లాలో వజ్రాన్వేషణ చేయడం ఏటా చూస్తుంటాం. ఈసారి మండలంలోని చిగిచెర్ల గ్రామ పొలాల్లో వజ్రాల వేట సాగిస్తున్నారు. కందుకూరు, ముష్టూరుకు వెళ్లే రహదారుల పక్కన పొలాల్లో గతంలో పలువురికి వజ్రాలు దొరికాయి. ఈ నేపథ్యంలో వజ్రాల కోసం మండలానికి వస్తున్నారు. ప్రస్తుతం వర్షం కురుస్తుండటంతో తండోపతండాలుగా జనాలు తరలివచ్చి, వజ్రాల కోసం అన్వేషిస్తున్నారు. ధర్మవరం, అనంతపురం నుంచి ప్రజలు ఆటోలు, ద్విచక్రవాహనాల్లో తరలివచ్చి, అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. మరికొంతమంది మహిళలు రోజుకు రూ.500 కూలీ ఇచ్చి, మహిళలతో వెతికిస్తున్నారు.

రేపు యూటీఎఫ్ సమావేశం

కొత్తచెరువు, జూన్ 7: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 9న ఉదయం 10 గంటలకు యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ విద్య బలోపేతం, ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, సంక్షేమంపై చర్చిస్తామన్నారు. జిల్లాలోని యూటీఎఫ్ నాయకులు హాజరుకావాలని కోరారు.


హంద్రీనీవా కాలవ పరిస్థితి

పడకేసిన హంద్రీనీవా పనులు

- డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం ప్రశ్నార్థకం
- 3.45 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందేనా..?
- కలగానే మడకశిర బైపాస్ కాలువ
- మూలనపడిన సామూహిక బిందు సేద్యం
- కూటమి గెలుపుతో చిగురించిన ఆశలు




రిజర్వాయర్ గేట్లను పరిశీలిస్తున్న హంద్రీనీవా ఎస్ఈ దేసేనాయక్, ఇంజనీర్లు(ఫైల్)

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 7: వైసీపీ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా అటకెక్కించింది. ఒక్క ప్రాజెక్టు గానీ, చెరువు పనులు గానీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో ఎంతో అవకాశం ఉన్నా నీట వనరులను ఉపయోగించుకోలేని దయనీయ పరిస్థితి నెలకొంది. గడిచిన ఐదేళ్లుగా హంద్రీనీవాకు సంబంధించి ఏ ఒక్క పనీ ముందుకు సాగలేదు. కరువు జిల్లాలో హంద్రీనీవా ద్వారా వచ్చే కృష్ణా జలాలను సద్వినియోగం చేసుకుని సస్యశ్యామలం చేసే అవకాశం ఉన్నప్పటికీ...ఐదేళ్లుగా నిర్వీర్యం చేశారు. హంద్రీనీవాకు శ్రీశైలం డ్యాం నుంచి 42 టీఎంసీల నీటి కేటాయింపులు ఉన్నాయి. ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు సుమారు 30టీఎంసీల నీటిని వాడుకునే వెసులుబాటు ఉంది. అందుకు తగ్గట్టుగా రిజర్వాయర్లు, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థలు లేవు. దీనిపై ఇప్పటికే అనేకమార్లు హంద్రీనీవా ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపినా...వైసీపీ ప్రభుత్వం బుట్టలోకి వేస్తూ వచ్చింది. వీటితో పాటు మడకశిర బైపాస్ కెనాల్, పుట్టపర్తి నియోజవకర్గంలో 195 ఎంఐ చెరువులకు నీరు అందించే ప్రాజెక్ట్, గుంతకల్లు నియోజకవర్గంలో 12 చెరువులకు నీరిచ్చే పనులను పక్కన పడేశారు. ఉరవకొండ ప్రాంతంలో సుమారు 50వేల ఎకరాలకు సామూహిక బిందు సేద్యం ద్వారా సాగునీరు అందించేందుకు గత టీడీపీ ప్రభుత్వం 2018లో తీసుకువచ్చింది. వైసీపీ ప్రభుత్వం మూలనపడేసింది. రాప్తాడు నియోజకవర్గంలో మూడు జలాశయాలను ఇచ్చిన హామీని వైసీపీ బుట్టలో పడేసింది. హంద్రీనీవా పథకాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తే... ఉమ్మడి జిల్లాకు 3.45 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇచ్చి సమస్యశ్యామలం చేయడంపై కొత్త ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. రూ.1200 కోట్లతో డిస్ట్రిబ్యూటరీల నిర్మాణాలకు పంపిన ప్రతిపాదనలు అలాగే ఉండిపోయాయి.


బిందు సేద్య పరికరాలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు(ఫైల్)

మూలనపడిన సామూహిక బిందు సేద్యం

హంద్రీనీవా ద్వారా సాగునీరు అందని పొలాలకు నీటి సదుపాయం కల్పించడానికి గతంలో టీడీపీ ప్రభుత్వం సామూహిక బిందు సేద్యం (సీఎల్‌డీఐ) పథకాన్ని తీసుకు వచ్చింది. రూ.840 కోట్లతో 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం సీఎల్‌డీఐ పథకాన్ని రద్దు చేసింది. తక్కువ నీటితో అధిక పంటల దిగుబడి సాధించే విధంగా రైతులను ప్రోత్సాహించేందుకుగాను కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ సంరక్షణయోజనా పథకం కింద సుమారు రూ.271కోట్లు నిధులు చెల్లిస్తామని అప్పట్లో చెప్పారు. బెళుగుప్ప, కూడేరు, ఉరవకొండ మండలాల్లో సుమారు 50వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు సీఎల్‌డీఐ తీసుకువచ్చారు. వైసీపీ ప్రభుత్వం 2019లో పథకాన్ని పూర్తిగా రద్దు చేసింది. ఇందుకు సంబంధించి పరికరాలను మూలన పడేశారు.

కలగానే మడకశిర బైపాస్ కాలువ నిర్మాణం


హంద్రీనీవా కార్యాలయం

హంద్రీనీవా ద్వారా మడకశిరకు సాగు, తాగునీరు అందించేందుకు గత ప్రభుత్వం పెనుకొండ నుంచి నేరుగా మడకశిరకు నీటిని తరలించాలనే ఉద్దేశ్యంతో మడకశిర బైపాస్ కాలువ ప్రాజెక్ట్‌ను రూ.177కోట్లతో అంచనాలు తయారుచేసింది. వైసీపీ ఈ ప్రాజెక్ట్‌నూ విస్మరించింది. పుట్టపర్తి నియోజకవర్గంలోని 195మైనర్ ఇరిగేషన్ చెరువులకు ఫీడర్ చానల్ ద్వారా హంద్రీనీవా నీటిని తరలించాలనే ఉద్దేశ్యంతో రూ.737కోట్లతో ప్రతిపాదనలను వైసీపీ ప్రభుత్వం తిరస్కరించింది. ముదిగుబ్బ మండలంలో జిల్లేడుబండ రిజర్వాయర్ నిర్మాణానికి రూ.608కోట్లతో ప్రాజెక్ట్‌ను టీడీపీ ప్రభుత్వం ఆమోదించింది. ఇందుకు సంబంధించి ఇప్పటి వరకు రూ.100కోట్లు పనులు చేశారు. దీనికి వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు ఒక్క పైసా విదల్చలేదు. గుంతకల్లు, గుత్తి పరిధిలోని 12మైనర్ ఇరిగేషన్ చెరువులకు ఫీడర్ చానల్ ద్వారా హంద్రీనీవా నీటిని అందించేందుకు రూ.20కోట్లతో చేసిన ప్రతిపాదలను వైసీపీ ప్రభుత్వం తిరస్కరించింది.

సామూహిక బిందు సేద్యం అమలు చేయాలి:

కరువు జిల్లాలో వెనుకబడిన ప్రాంతమైన ఉరవకొండ పరిధిలో గత టీడీపీ ప్రభుత్వం చేపట్టిన సామూహిక బిందు సేద్యం పథకాన్ని వెంటనే అమలు చేయాలి. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం సామూహిక బిందు సేద్యం పథకాన్ని మూలనపడేసింది. కొత్త ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసి రైతులను ఆదుకోవాలి. కోట్లాది రూపాయల పరికరాలను గాలికివదిలేయం బాధాకరం. రైతులకు ఉపయోగపడే పనులను నిర్లక్ష్యం చేయడం మంచిదికాదు.



- కురుగుంట మనోహర్, రైతుసంఘం నాయకుడు, ఉరవకొండ

డిస్ట్రిబ్యూటరీలు నిర్మించాలి: సుల్తాన్, రైతు, ఉరవకొండ



హంద్రీనీవా పథకం కింద డిస్ట్రిబ్యూటరీలు నిర్మించాలి. పిల్ల కాలువల ద్వారా హంద్రీనీవా నీటిని నేరుగా ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చు. పంటలకు కనీస నీటి వసతి లేక నానా అవస్థలు పడుతున్నాం. డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి. ఇప్పటికే అనేకమార్లు హంద్రీనీవా అధికారులకు విన్నవించాం.

ప్రతిపాదనలను అమలు చేస్తే జిల్లా సస్యశ్యామలం

హంద్రీనీవా ఇంజనీర్లు చేసిన ప్రతిపాదనలు అమలుచేస్తే ఉమ్మడి అనంతపురం జిల్లా సస్యశ్యామలమవుతుంది. హంద్రీనీవా కాలువ కింద డిస్ట్రిబ్యూటరీల నిర్మాణాలకు రూ.1200 కోట్లు ప్రతిపాదనలు పంపాం. మడకశిర బైపాస్ కెనాల్, గుంతకల్లు, పుట్టపర్తి మైనర్ ఇరిగేషన్ చెరువులకు నీళ్ల నింపే ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు అందజేశాం. హంద్రీనీవా కాలువకు కాంక్రీట్ లైనింగ్ వేసి, డిస్ట్రిబ్యూటరీలను నిర్మిస్తే ఉమ్మడి జిల్లాలో 3.45 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ప్రజాప్రతినిధులు దృష్టిపెడితే మా వంతుగా పూర్తి సహకారం అందిస్తాం.



- దేసేనాయక్, ఎస్ఈ, హెచ్ఎన్ఎస్ఎస్-2

బీటీపీ, పేరూరు ప్రాజెక్ట్‌ల పరిస్థితీ అంతే..

గత టీడీపీ ప్రభుత్వం బీటీపీ, పేరూరు ప్రాజెక్టులను ఆమోదిస్తూ నిధులు కేటాయించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ రెండు ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించింది. భైరవానితిప్ప ప్రాజెక్టుకు జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా నీటిని తరలించేందుకు 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.541కోట్లు కేటాయించింది. చేసిన అరకొర పనులకూ వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తూ వచ్చింది. ఇప్పటి వరకు చేసిన పనుల్లో రూ.20కోట్లు బకాయిలు చెల్లించాల్సిఉంది. అదే జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు డ్యాంకు నీళ్ల తరలించేందుకు అప్పర్ పెన్నా ప్రాజెక్టుకు రూ.591కోట్లు నిధులతో చేపట్టారు. 53కిలో మీటర్ల కాలువ పనులతో పాటు సోమరవాండ్లపల్లి, పుట్టకనుమ తగరకుంట వద్ద రెండు జలాశయాలు నిర్మించాలని పనులు చేపట్టారు. ఇప్పటి వరకు రూ.164కోట్లు పనులు చేయగా రూ.100కోట్లకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

చంద్రబాబు, లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యేలు

న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి: టీడీపీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కొత్త ఎమ్మెల్యేలు కలిశారు. ఉండవల్లిలోని వారి నివాసంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఆమె సోదరి కిన్నెరశ్రీ కలిశారు. నారా లోకేశ్‌ను మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి కలిసి సత్కరించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూ రారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, కేరళ రిటైర్డ్ డీజీపీ శంకర్‌రెడ్డి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబును కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు శుక్రవారం ఢిల్లీలో కలిసి సత్కరించారు. అఖండ మెజార్టీతో గెలిచిన తనను చంద్రబాబు అభినందించారని ఆయన తెలిపారు. తనతో పాటు తన కుమారుడు యశ్వంత్‌చౌదరి, నాయకులు రాజగోపాల్ చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలియజేశామని అన్నారు.


చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పల్లె కుటుంబసభ్యులు


చంద్రబాబుతో బండారు శ్రావణిశ్రీ


చంద్రబాబునాయుడును శాలువాతో సన్మానిస్తున్న సురేంద్రబాబు


ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 7: కేంద్రహోంమంత్రిత్వ శాఖ 2025వ సంవత్సరం రిపబ్లిక్ డే నాడు అందజేయనున్న పద్మ అవార్డులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారి కరుణకుమారి తెలిపారు. కళలు, సాహిత్యం-విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక-సాంఘిక సేవ, సైన్స్-ఇంజనీరింగ్, ప్రజా సంబంధాలు, సివిల్ సర్వీసెస్, ట్రేడ్-ఇండస్ట్రీ అంశాలలో ఉత్తమ సేవలు అందించిన సేవకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్ నంబరు 9959517370ను, వెబ్‌సైట్‌ https://awards.gov.in. వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

టెన్సింగ్ నార్కే జాతీయ సాహస అవార్డులకు..

కేంద్ర యువజన వ్యవహారాలు-క్రీడల మంత్రిత్వశాఖ ఏటా అందజేసే టెన్సింగ్ నార్కే జాతీయ సాహస అవార్డులకు 2023 సంవత్సరానికి గాను దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారి కరుణకుమారి తెలిపారు. 2021, 2022, 2023 సంవత్సరాల్లో భూమి, నీరు (సముద్రం), గాలి వంటి వాటిపై చేసిన సాహస కార్యకలాపాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన సాహసికులు టెన్సింగ్ నార్కే జాతీయ సాహస అవార్డులకు అర్హులన్నారు. సాహస క్రీడల్లో తమకు తాము అంకితం చేసుకుని, నైపుణ్యం ప్రదర్శించిన వ్యక్తులకు జీవితకాల సాఫల్యం కింద ఈ అవార్డులను ప్రతి ఏటా రాష్ట్రపతి చేతుల మీదుగా అందజేస్తారన్నారు. అవార్డు గ్రహీతలకు టెన్సింగ్ నార్కే కాంస్య విగ్రహంతో పాటు ప్రశంసా పత్రం, రూ.15లక్షలు నగదు అందజేస్తారని తెలిపారు. ఈనెల 14వతేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సెల్ నంబరు 9959517370ను వెబ్‌సైట్‌ https://awards.gov.in సంప్రదించాలని కోరారు.

దీర్ఘకాలిక సెలవులో ఉద్యానశాఖ ఇన్‌చార్జి అధికారి

అనంతపురం అర్బన్, జూన్ 7: ఉద్యాన శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి నరసింహారావు దీర్ఘకాలిక సెలవు పెట్టారు. దాదాపు 40 రోజులపాటు ఆయన సెలవు పెట్టినట్లు సమాచారం. ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్ ఖాన్‌కు జిల్లా ఉద్యాన శాఖ అధికారిగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించనున్నారు.

గుట్టనే మింగేస్తున్నాడు..!


ఎక్స్‌కవేటర్‌తో గుట్టను చదును చేస్తున్న దృశ్యం

- ప్రభుత్వ భూమిపై కన్ను
- ఎక్స్‌కవేటర్‌తో చదును
- పనులు అడ్డుకున్న అధికారులు

గాండ్లపెంట, జూన్7: మండలంలోని కోటూరు గ్రామానికి చెందిన వైసీపీ మద్దతుదారుడు ప్రభాకర్ ప్రభుత్వ భూమిలోని గుట్టనే మాయం చేస్తున్నాడు. భూమి సొంతం చేసుకునే ప్రయత్నం చేస్తున్నాడు. గ్రామ సర్వే నంబరు 275లో ప్రభాకర్‌కు పొలం ఉంది. పక్కనే సర్వే నంబరు 213లో 1.20 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో పెద్దగుట్ట ఉంది. రూ.7 లక్షల విలువైన ఆ భూమిపై ప్రభాకర్ కన్ను పడింది. ఎక్స్‌కవేటర్ సాయంతో రెండ్రోజులుగా గుట్ట చదును పనులు చేపడుతున్నాడు. విషయాన్ని స్థానికులు. రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వీఆర్వో చంద్రశేఖర్ రెడ్డి ఘటనాస్థలానికెళ్లి, పనులను నిలిపివేయించారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అధికారులకు అభినందనలు..

ముదిగుబ్బ, జూన్7: ఉమ్మడి అనంతపురం జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించిన అధికారులకు అభినందనలు తెలుపుతున్నట్లు జాతీయ మానవహక్కుల కౌన్సిల్ దక్షిణ భారతదేశ రాష్ట్రాల గౌరవాధ్యక్షుడు వెంగమేష్ చౌదరి పేర్కొన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ఎక్కడా అవాంచనీయ ఘటనలు జరగకుండా ఎన్నికలు ముగియడం హర్షణీయమన్నారు. పూర్తి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి ఎన్నికలను విజయవంతం చేసిన కలెక్టర్, ఎస్పీ, సంబంధిత అధికారులకు అభినందనలు తెలిపారు. మానవహక్కుల విషయంలో ప్రజలకు అండగా నిలుస్తున్నామన్నారు. హ్యూమన్ రైట్స్ జాతీయ స్థాయిలో విస్తృతంగా పనిచేస్తోందన్నారు. హక్కులకు ఎక్కడ భంగం కలిగినా తమ కమిటీ సంపూర్ణ మద్దతు ఇస్తూ అండగా నిలబడుతోందన్నారు. గ్రామ స్థాయిలో ఎక్కడైనా హక్కులకు భంగం వాటిల్లితే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు.


వెంగమేశ్ చౌదరి

పోలీస్ వాహనం బోల్తా

- డీఎస్పీకి తప్పిన ప్రమాదం
- ముగ్గురు కానిస్టేబుళ్లకు గాయాలు

పెనుకొండ రూరల్, జూన్ 7: మండలంలోని పులేకమ్మ గుడివద్ద 44వ జాతీయ రహదారిపై శుక్రవారం ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి ప్రమాదవశాత్తు డీఎస్పీ వాహనం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డీఎస్పీ బాబిజాన్‌సైదతో పాటు ముగ్గురు కానిస్టేబుళ్లు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు డీఎస్పీతో పాటు హెడ్‌కానిస్టేబుల్ మధుసూదన్, నాగరాజు, హోంగార్డు జబీవుల్లా, డ్రైవర్ భైవరశెట్టి కారులో సోమందేపల్లి స్టేషన్‌కు వెళ్లి తిరిగి పెనుకొండకు వస్తున్నారు. పెనుకొండ సమీపంలోని పులేకమ్మ ఆలయం వద్దకు రాగానే పెనుకొండ వైపునుంచి ఓ ద్విచక్రవాహనదారుడు యూటర్న్ తీసుకుంటుండగా డీఎస్పీ వాహనం అతనిని తప్పించబోయి అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డీఎస్పీ ఎడమచేతికి స్వల్పగాయమైంది. హెడ్ కానిస్టేబుల్ మధుసూదన్, నాగరాజు, హోంగార్డు జబీవుల్లా తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు హుటాహుటిన వాహనంలో నుంచి వారిని బయటికి తీశారు. క్షతగాత్రులను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి మరో కారులో తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం హెడ్‌కానిస్టేబుల్ మధుసూదన్‌ను అనంతపురం ఆస్పత్రికి తరలించారు.


ప్రమాద స్థలంలో డీఎస్పీ


బోల్తా పడిన డీఎస్పీ వాహనం


గాయపడిన హెడ్ కానిస్టేబుల్ మధుసూదన్

అక్కడ జరిగింది సంబరాలే: ఎస్పీ



పుట్టపర్తి రూరల్, జూన్ 7: రామగిరి మండలం సుద్దకుంటపల్లి తండాలో వేటకొడవళ్లతో వీరంగం సృష్టించారని ఓ న్యూస్ చానల్‌లో వచ్చిన కథనంలో వాస్తవం లేదని ఎస్పీ మాధవరెడ్డి స్పష్టం చేశారు. పుట్టపర్తిలోని డీపీఓలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ ఘటనపై వెంటనే విచారించామన్నారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ అనంతరం ఈ నెల 4న తమ పార్టీ అభ్యర్థి గెలుపొందారన్న సమాచారంతో గ్రామంలో కొందరు కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారని అన్నారు. పొట్టేలును కోసేందుకు వారు మచ్చుకత్తులు పట్టుకున్నారని, ఎవరినీ భయభ్రాంతులకు గురిచేయలేదని వివరించారు. వీరంగం సృష్టించే ఉద్దేశం వారికి లేదని పోలీసు విచారణలో తేలిందని అన్నారు. ఆ న్యూస్ చానల్ కథనం పూర్తిగా అవాస్తమని ఎస్పీ స్పష్టం చేశారు. ఘటనను వక్రీకరించి, ప్రత్యర్థులను బెదిరించడానికి, గ్రామంలో భయానక వాతావరణం సృష్టించడానికి వేటకొడవళ్లతో వీరంగం చేశారని, ఆ న్యూస్ చానల్ ప్రచారంపై వెంటనే విచారణ చేపట్టాలని రామగిరి పోలీసులను ఆదేశించామని తెలిపారు. తండాలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించి సంబరాలు చేసుకున్నందుకు కేసు నమోదు చేశామని తెలిపారు. ఎన్నికల్లో ఓడిపోయిన అనంతరం వైసీపీ శ్రేణులపై దాడులు జరుగుతున్నాయని, వేటకొడవళ్లతో వీరంగం చేశారని ఓ చానల్‌లో కథనం ప్రసారమైంది. ఈ కథనాన్ని పోలీసు శాఖ సీరియస్‌గా తీసుకుంది.

సస్పెన్షన్లు ఎత్తివేయండి

- కలెక్టర్‌ను కోరిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు

అనంతపురం టౌన్, జూన్7: ఎన్నికల నేపథ్యంలో పలు కారణాలతో ఉద్యోగ, ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారని, ఆ సస్పెన్షన్లను ఎత్తి వేయాలని ఆయా సంఘాల నేతలు కోరారు. శుక్రవారం ఏపీఎస్ఈ, ఆపస్, ఎస్ఎల్‌టీఏ, డీటీడబ్ల్యూ సంఘాల నాయకులు కలెక్టర్‌ను కలిసి ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించినందుకు అభినందించారు. అనంతరం సంఘాల నేతలు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సస్పెండ్ అయినవారి ఉత్తర్వులను రద్దుచేసి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. బీఎల్‌ఓలకు నిబంధనల మేరకు గౌరవ వేతనం చెల్లించాలని, ఎన్నికల రెమ్యునరేషన్‌లో అసమానతలను తొలగించాలని కోరుతూ వినతి పత్రం అందజేసారు. కార్యక్రమంలో ఏపీస్టేట్ ఎంప్లాయిస్ రాష్ట్ర అద్యక్షుడు విజయబాస్కర్, ఆపస్ జిల్లా ప్రదానకార్యదర్శి ఎర్రిస్వామి, రాష్ట్రకార్యదర్శి రాజేంద్ర, ఎస్ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు ఆదిశేషయ్య, డీటీడబ్ల్యుఏ నాయకులు వెంకటేష్, నాగరాజుపాల్గొన్నారు.


కలెక్టర్‌ను అభినందిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు

చీనీకాయలు టన్ను రూ.40 వేలు

అనంతపురం రూరల్, జూన్ 7: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.40 వేలు, కనిష్ఠంగా రూ.16 వేలు, సరాసరి రూ.26 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 604 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

రైళ్ల రద్దు

గుంతకల్లు, జూన్ 7: సెంట్రల్ రైల్వేలో జరుగుతున్న మరమ్మతు పనుల కారణంగా గుంతకల్లు మీదుగా వెళ్లే రెండు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. బిలాస్‌పూర్ నుంచి యలహంక వెళ్లే ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక రైలు (08291)ను ఈనెల 15, 18, 22, 25, 29 జూలై 1, 4, 8 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 08292)ను ఈనెల 17, 20, 24, 27, జూలై 1 4, 8 తేదీల్లోనూ రద్దు చేసినట్లు తెలిపారు. చెన్నై-సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ (నెం 22601) ఈ నెల 12, 19 తేదీల్లో చెన్నై నుంచి రెండు గంటల ఆలస్యంగా బయల్దేరుతుందని తెలిపారు. ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని కోరారు.

పొంచివున్న విద్యుత్ ప్రమాదాలు

- భయాందోళనల్లో ప్రజలు
- పట్టించుకోని విద్యుత్ అధికారులు

ముదిగుబ్బ, జూన్ 7: వర్షాలు కురుస్తున్న ప్రస్తుత తరుణంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. పొలాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగల వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయి. మండలంలో పలు వ్యవసాయ పొలాల వద్ద చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. పొలాలకు వెళ్లే రైతులు ఏమరుపాటుగా వ్యవహరిస్తే ప్రమాదానికి గురికావాల్సిందే. విషయం తెలిసినా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రాణాలుపోతేకానీ స్పందించరా అంటూ ఆవేదన చెందుతున్నారు. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరి కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. మరికొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ముళ్లకంపలతో నిండి, రక్షణ కంచె లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి. అటువైపు వెళ్లే చిన్నారులు, మూగజీవాలు పొరపాటున సమీపంగా వెళితే ప్రాణాలు పోయే పరిస్థితి ఉంది. ఇక


ముదిగుబ్బలోని పులివెందుల రోడ్డులో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

వర్షాలకు బోరుబావుల కనెక్షన్లు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు సమస్యలు తలెత్తుతాయని, ఆ సమయంలో విద్యుత్ సిబ్బంది స్పందించరని, ఎన్ని సార్లు ఫోన్ చేసినా పలకరని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. చేసేదిలేక తామే వాటి వద్దకు వెళ్లి మరమ్మతులు చేసుకుంటామని చెబుతున్నారు. ఏదేని విద్యుత్ ప్రమాదాలు జరిగితే ఎవరూ బాధ్యులని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


దొరిగిల్లు రోడ్డు పక్కన ఒరిగిన విద్యుత్ స్తంభం

ఫోన్ చేసినా స్పందించరు..



వర్షాకాలం కావడంతో బావుల వద్ద మోటార్లకు తరచూ ఫీజులు పోతుంటాయి. విద్యుత్ హెచ్చుతగ్గులు అవుతూ ఉంటుంది. దీంతో స్టార్టర్ పెట్టెలు కాలిపోతుంటాయి. విద్యుత్ తీగలు తెగిపడినప్పుడు విద్యుత్ సిబ్బందికి ఫోన్ చేస్తే స్పందించరు. దీంతో మేమే మరమ్మత్తు చేసుకుంటాం. ఆ సమయంలో ఏదైనా ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యులు.

-గుర్రం చంద్ర, రైతు, పొడరాళ్ళపల్లి

అధికారులు చర్యలు తీసుకోవాలి..



ముదిగుబ్బలో ఇటీవల తరచూ విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షాకాలం కావడంతో అవి మరింత అధికమయ్యే అవకాశం ఉంది. ఇలాంటివి జరగకుండా విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టాలి.

- కేతన వెంకటపతి, ముదిగుబ్బ

సమస్యలను పరిష్కరిస్తాం..

మండలంలో కంచెలు లేని ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెలు ఏర్పాటు చేస్తాం. శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలను మారుస్తాం. కిందకు వేలాడుతున్న వైర్లను ఎత్తులో ఏర్పాటు చేస్తాం. మండలంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

- బాల సుబ్రహ్మణ్యం, విద్యుత్ ఏడీ, కదిరి

నిరుపయోగంగా గోడౌన్

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..

గాండ్లపెంట, జూన్ 7: మండలకేంద్రంలోని పోరెడ్డివారిపల్లి వద్ద నిర్మించిన బహుళప్రయోజన గోడౌన్ నిరుపయోగంగా ఉంది. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు వాపోతున్నారు. రైతులు పండించిన పంటల నిల్వ కోసం రూ.40లక్షల నాబార్డు నిధులతో ఈ గోడౌన్ 6 నెలల కిందట నిర్మించారు. అయితే అక్కడ సరైన వసతులు లేవు. ముఖ్యంగా రహదారి లేదు. అలాగే ప్రహరీ , విద్యుత్, నీటిసౌకర్యా లు కూడా లేవు. ఏదైనా పంటలు నిలువ చేసుకోవాలంటే గోడౌన్‌కు వెళ్లడానికి రోడ్డు కూడా లేదని రైతులంటున్నారు. దీంతో ఉపయోగంలో లేక లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఈగోడౌన్‌కు తాళాలు కూడా వేయకపోవడంతో మందుబాబులు తరచూ వచ్చి మద్యం సేవిస్తున్నారని, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఈ గోడౌన్‌కు సౌకర్యాలు ఏర్పాటు చేసి ఉపయోగంలోకి తేవాలని వారు కోరుతున్నారు.


నిరుపయోగంగా ఉన్న గోడౌన్, (ఇన్‌సెట్లో) మందుబాబు పడేసిన మద్యం బాటిళ్లు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

కొత్తచెరువు, జూన్ 7: మండలంలోని తిరుమలదేవరపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ శుక్రవారం 10 మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ల ను పంపిణీ చేశారు. కనుముక్కల, తలమర్ల, బీడుపల్లి పాఠశాలలకు సమీప గ్రామాల నుంచి నడుచుకుంటూ వెళ్తున్న ఈ విద్యార్థులను ఆయన గుర్తించి సత్యసాయి భక్తుల ఆర్థికసాయంతో సైకిళ్లను పంపిణీ చేశారు. వీటిని మండల కేంద్రంలో విద్యార్థులకు అందజేశారు. వేములేటిపల్లి పాఠశాల హెచ్‌ఎం కేశవనాయుడు, పాతదేవరపల్లి పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


సైకిళ్లతో విద్యార్థులు

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి: కందికుంట

కదిరిఅర్బన్, జూన్ 7: ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కదిరి ఎమ్మెల్యే గా గెలుపొందిన కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలో శుక్రవారం ఆయన్ను ఆర్టీసి కార్మికులు కలిసి పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. తమ సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని విన్నవించారు. ఇందుకు కందికుంట మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి కార్మిక సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఈయూ నాయకులు జీవైపీ రావు, ఆర్ ఎస్ రెడ్డి, జీసీఎస్ నాయుడు, శంకరప్ప, హరికుమార్, సుధీర్, సలాంబాషా తదితరులు పాల్గొన్నారు.


కందికుంటను అభినందిస్తున్న ఆర్టీసీ కార్మికులు

- కదిరి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్ విజయం సాధించడంతో అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన్ను పట్టణంలోని నివాసంలో శుక్రవారం పెద్ద ఎత్తున ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రైవేటు విద్యాసంస్థల యజమానులు కలిసి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపారు.

మొక్కు తీర్చుకున్న టీడీపీ శ్రేణులు

ఓబుళదేవరచెరువు, జూన్ 7: కూటమి అధికారంలోకి రావడం, పల్లె సింధూర ఎమ్మెల్యే కావడంతో మండలంలోని పోలేవాండ్లకొత్తపల్లికి చెందిన టీడీపీ నాయకురాలు మంజులారెడ్డి కుటుంబ సభ్యులు స్థానిక అక్కమ్మ ఆలయంలో శుక్రవారం మొక్కున్నారు. ఈసందర్భంగా అక్కదేవతలకు ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులకు అన్నదానం చేశారు. అక్కడే కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి బడిశం రామాంజనేయులు, నాయకులు శంకర్, వెంకటేష్, కేశవ, గంగాద్రి, ఆనంద్, తిరుపాల్, దారా వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పూజలు

బుక్కపట్నం, జూన్ 7: దేశ ప్రధానిగా మూడవ సారి నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం చేయనుండడంతో మండలకేంద్రంలోని బీజేపీ నాయకులు శుక్రవారం చౌడేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కల్లుగీత కార్మికుల రాష్ట్ర కన్వీనర్ హరిక్రిష్ణగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు కొండమరాజు, జిల్లా మీడియాకన్వీనర్ జ్యోతి ప్రసాద్ తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం మాట్లాడుతూ.. నరేంద్రమోదీ మూడోసారి కేంద్రంలో అధికారం చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బుక్కపట్నం, పుట్టపర్తి రూరల్, పుట్టపర్తి పట్టణాధ్యక్షులు చెన్నప్ప, భాస్కర్‌రెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.


ఆలయం వద్ద మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కలిసికట్టుగా సమస్యలు పరిష్కరించుకుందాం

ధర్మవరం, జూన్ 7: అందరం కలిసికట్టుగా ఉండి పోరాటాలు సాగించి సమస్యల్ని సమస్యల్ని పరిష్కరించుకుందామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నామల శంకర్, సీనియర్ నాయకుడు బోయ రవిచంద్ర పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్జీఓ హోం కార్యాలయంలో శుక్రవారం బీసీల ఆత్మీయ సమావేశం చేనేత ప్రముఖుడు గిర్రాజురవి అధ్యక్షతన జరిగింది. ఇందులో నామల శంకర్, బోయ రవిచంద్ర మాట్లాడుతూ... ధర్మవరం పట్టుచీరకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. ఇక్కడ చేనేత పరిశ్రమపై అన్ని వర్గాల ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అందిరినీ కలుపుకుని సమష్టిగా పోరాడి సమస్యలను పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. 50 ఏళ్ల క్రితం బీసీలైన కాశెట్టిశ్రీనివాసులు, పల్లెంవెంకటేశ్ ఇక్కడ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యంవహించారన్నారు. మళ్లీ ఇప్పుడు సత్యకుమార్‌యాదవ్ రావడం ఆనందంగా ఉందన్నారు. బీసీల సమస్యల పరిష్కారానికి సత్యకుమార్ కృషి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘాలనాయకులు బొట్టుకిష్ట, పల్లపు రవీంద్ర, గోపాల్, పోతలయ్య, సదాశివనంద, శ్రీనివాసులు, జింకల రాజన్న, పల్లపు శివశంకర్, చీమల రామాంజి, పూలకుంట్ల మహేశ్, క్లస్టర్ రామాంజి, అంకన్న, చీమల సుబ్బరాయుడు, ఆదికేశవులు, చీమల సూరి పాల్గొన్నారు.


ఐక్యతను తెలుపుతున్న బీసీసంఘాల నాయకులు

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం

ముదిగుబ్బ, జూన్7: కార్యాలయంలో మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింది. మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు నామమాత్రంగానే హాజరయ్యారు. కొందరు ప్రజాప్రతినిధులు వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొందని, వేరుశనగ విత్తన కాయలు నాసిరకంగా ఉన్నాయని చెప్పారు. ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, వైస్ ఎంపీపీ వెంకటరెడ్డి, ఎంపీడీవో నాగశేషాచల రెడ్డి, తహసీల్దార్ సరస్వతి పాల్గొన్నారు.

బడిబయటి పిల్లల గుర్తింపునకు సర్వే

కదిరిఅర్బన్, జూన్ 7: మండలంలోని కుమ్మరవాండ్లపల్లిలో శుక్రవారం బడిబయట పిల్లల గుర్తింపు కోసం విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలకు రాని పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి, బడిలో చేర్పేలా ప్రోత్సహిస్తున్నారు. 6నుంచి 14 సంవత్సరాల వయసులోపు పిల్లలను గుర్తిస్తున్నారు. ఈనెల 1వ నుంచి సర్వేప్రారంభమైనట్లు చెప్పారు. మండలంలో ఇప్పటివరకు 17మందిని గుర్తించామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ చెన్నక్రిష్ణ, ఎంఇఓ-2 ఓబులరెడ్డి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కుమ్మరవాండ్లపల్లిలో సర్వే చేస్తున్న ఎంఈఓలు తదితరులు

బత్తలపల్లిలో భారీ వర్షం

- జలమయమైన కాలనీలు
- పొంగిన చెక్‌డ్యాంలు, కుంటలు


బత్తలపల్లి మండలం పోట్లమర్రిలో వర్షపు నీటితో పొంగిపొర్లుతున్న చెక్‌డ్యాం


ఎన్‌పీకుంట తహసీల్దార్ కార్యాలయం సమీపంలో రోడ్డుపై గుంతల్లో చేరిన వర్షపు నీరు

బత్తలపల్లి, జూన్7: మండలవ్యాప్తంగా గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం భారీ వర్షం కురిసింది. దీంతో పలు కాలనీలు జలమయం అయ్యాయి. మండలకేంద్రంతో పాటు పోట్లమర్రి గ్రామంలోని చెక్‌డ్యాములు, కుంటలు నీటితో పొంగిపొర్లాయి. అలాగే చెరువులకు కొద్దిపాటిగా నీరు చేరాయి. వ్యవసాయ పొలాలకు వెళ్లే దారులు కోతకు గురయ్యాయి. గురువారం రాత్రి 68.4మిమీల వర్ష పాతం నమోదైనట్లు ఏఎస్‌ఓ శర్మ తెలిపార

ఓబుళదేవరచెరువు: మండలకేంద్రంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో కదిరి-హిందూపురం ప్రధాన రహదారి మొత్తం జలయమయమైంది. ఇళ్లల్లోకి నీరు పెద్దఎత్తున చేరాయి. తిండిగింజలు, వస్తువులు, తడిసిపోయాయని ప్రజలు వాపోయారు. గతంలో నమాజుకట్ట పైప్రాంతంలో ఉన్న కాలువల ద్వారా వర్షపు నీరు చెరువుకు వెళ్లేవని, ఇప్పుడు కాల్వలు పూడిపోవడంతో నీరంతా ఇక్కడే నిల్వ అయి ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు పేర్కొన్నారు. వర్షానికి స్థానికంగా ఉన్న రాయలసీమ సామిల్లు పాక్షికంగా దెబ్బతింది. రూ.1.50లక్షలు నష్టం జరిగినట్లు నిర్వాహకుడు రహంతుల్లా వాపోయాడు. మండలవ్యాప్తంగా 45.2 మిమీల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

నంబులపూలకుంట: మండలవ్యాప్తంగా గురువారం రాత్రి, శుక్రవారం మోస్తారు వర్షం కురిసింది. నీరు రోడ్లపై పారడంతో గుంతలు నిండాయి. కదిరి- రాయచోటి ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంతలు నిండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఎగువ పొలాలనుంచి వచ్చే నీరు దేవరచెరువులోకి వెళ్లకుండా రోడ్డుపైకి చేరడంతో ప్రయాణికులకు ఇబ్బంది మరింత ఎక్కువైంది.

సత్యకుమార్ గెలుపుపై సంబరాలు

ధర్మవరం, జూన్ 7: ధర్మవరం ఎమ్మెల్యేగా సత్యకుమార్‌యాదవ్ గెలుపుపై పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేశారు. మిఠాయిలు పంచారు. అనంతరం పలువురు మాట్లాడుతూ సత్యకుమార్ గెలుపునకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేశారన్నారు. రాష్ట్ర ప్రజలు ఓటు ద్వారా అవినీతి వైసీపీకి తగిన బుద్ధి చెప్పారన్నారు. సత్యకుమార్ నాయకత్వంలో నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జింకాచంద్రశేఖర్, నాయకులు సాకే ఓబుళేశు, గుండా పుల్లయ్య, కార్తీక్, నబీరసూల్, పుట్లూరు నరసింహులు, గట్టునాగరాజు, భక్తవత్సలం, పోతలయ తదితరులు పాల్గొన్నారు.

- పట్టణంలోని కూటమి శ్రేణులు స్థానిక శారదానగర్‌లోని అక్కదేవతల ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తొలుత అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. తర్వాత ఆలయం ఎదుట 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు ఫాతిమా, వలి, కొత్తకోట వెంకటరాయుడు, ఆదెప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, రవినాయక్, భాస్కర్‌రెడ్డి, రవీంద్ర, రమేశ్‌నాయక్, సోమునాయక్, ఈశ్వరనాయక్ తదితరులు పాల్గొన్నారు.


శారదానగర్‌లోని అక్కదేవతలకు కొబ్బరికాయలు కొడుతున్న దృశ్యం

పుస్తక పఠనం అలవాటు చేయాలి

కొత్తచెరువు, జూన్ 7: తల్లిదండ్రులు పిల్లలకు చిన్నప్పటి నుంచే పుస్తకాలు చదివేది అలవాటు చేయాలని మాజీ సర్పంచ్ హరినాథ్‌చౌదరి సూచించారు. మండలకేంద్రంలోని గ్రంథాలయంలో శుక్రవారం వేసవి శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి జయరాం నిర్వహించారు. మాజీ సర్పంచ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. పుస్తకపఠనం వల్ల విజ్ఞానంతో పాటు తెలివితేటలు పెంపొందించుకోవచ్చన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు చిన్నప్పటి నుంచే పుస్తకాలు చదివేది అలవాటు చేయాలన్నారు. అనంతరం ఇంతకుమునుపు నిర్వహించిన పలు పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి

ధర్మవరం: గ్రంథాలయాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారిణి అంజలి సౌభాగ్యవతి సూచించారు. పట్టణంలోని గ్రంథాలయంలో 20రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. దీంతో ముగింపు కార్యక్రమంలో అధికారిణి మాట్లాడుతూ పిల్లలు క్రమశిక్షణతో చదుంవుకోవాలన్నారు. ముఖ్యంగా సెల్ ఫోన్ లకు దూరంగా ఉండాలన్నారు. పుస్తకాలు చదివే అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఏజెంట్లు నాగరాజు, మురళి, ముకుంద పాఠకులు పాల్గొన్నారు.


ధర్మవరంలో విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

ఈదురుగాలులకు కూలిన వేపచెట్టు


రోడ్డుకు అడ్డంగా పడిపోయిన వేపచెట్టు

ధర్మవరం, జూన్ 7: పట్టణంలోని కొత్తపేటలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలో గల వేపచెట్టు గురువారం రాత్రి వీచిన ఈదురుగాలులకు కూలి పోయి రోడ్డుకు అడ్డంగా పడింది. దీంతో రాకపోకలు సాగించడానికి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేపచెట్టు కూలే సమయంలో అక్కడ ఎవరూ లేదు. దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ సిబ్బంది వచ్చి ఆ వేపచెట్టును రోడ్డుపై నుంచి పక్కకు తొలగించారు.

భారీవాహనాలతో ట్రాఫిక్ ఇబ్బందులు



పట్టణ నడిబొడ్డున వెళ్తున్న భారీ కంటైనర్

ధర్మవరం రూరల్, జూన్ 7: పట్టణంలో ప్రధాన రహదారుల్లో భా రీ వాహనాలు రాకపోక లు సాగిస్తుండడంతో ట్రా ఫిక్ సమస్య ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రు. సాయంత్రం 6గంటల తర్వాతే భారీ వాహనాలకు పోలీసులు అనుమతి ఇవ్వాల్సి ఉంది. అయితే ఈ మధ్యన పోలీసులు పట్టించుకోకపోవడంతో భారీవాహనాలైన లారీలు, కంటైనర్లు పట్టణంలోని ప్రధానరహదారులు గుండా రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య నెలకొని ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పోలీసులు భారీ వాహనాలను పగటి పూట పట్టణంలో వెళ్లకుండా కట్టడిచేయాలని పలువురు కోరుతున్నారు.

అవినీతి అధికారులను తొలగించండి

బత్తలపల్లి, జూన్ 7: మండలకేంద్రంలోని మహాత్మ గాంధీ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో అవినీతికి పాల్పడే అధికారులను తొలగించాలని తెలుగు యువత నాయకులు డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలలో తెలుగు యువత నాయకులు శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ పాఠశాలలో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న అధికారులు వైసీపీ నాయకులతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఓ ప్రధాన అధికారి పదో తరగతి పాస్ అయిన విద్యార్థులకు టీసీలు, మార్కుల లిస్టు ఇవ్వడానికి డబ్బు వసూలు చేశారని తెలిపారు. కమిషన్‌లు తీసుకుని పాఠశాల అభివృద్ధి పనులను నాసిరకంగా చేయించారని మండిపడ్డారు. ఏనాడూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి అవినీతికి పాల్పడిన అధికారులను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు సతీష్, అశోక్, కిరణ్, తిరపతయ్య, శివ, సుధాకర్, సోము పాల్గొన్నారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

కొత్తచెరువు, జూన్ 7: మండలంలోని బండ్లపల్లి సమీపం నారాయణపురం రైల్వే స్టేషన్ దగ్గరలో గుర్తుతెలియని వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం వెలుగుచూసింది. హిందూపురం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నారాయణపురం రైల్వేస్టేషన్ సమీపంలో నీలిరంగు నైట్ ఫ్యాంటు, గ్రేకలర్ టీషర్టు వేసుకున్న యువకుడు రైల్వే పట్టాలపై తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడికి 35 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు ఉండవచ్చన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే 9441238182కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

కదిరి అర్బన్, జూన్ 7: విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని కదిరి ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్ సూచించారు. డిపో ఆవరణలో శుక్రవారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అవకాశమున్నచోట మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

11న సర్వసభ్య సమావేశం

కొత్తచెరువు, జూన్ 7: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 11వ తేదీ ఉదయం 11గంటలకు సర్వసభ్య సమావేశం జరగనుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ సిద్ధారెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని 15శాఖల మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. అదేవిధంగా ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు రావాలని సూచించారు.

16న అక్షరాభ్యాసం

ఓబుళదేవరచెరువు, జూన్ 7: మండలంలోని ఎం.కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో ఈనెల 16వ తేదీన అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ సంకల్పకులు పచ్చర్ల ఆంజనేయులనాయుడు తెలిపారు. ఈ మేరకు కరపత్రాలను ఆలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని కదిరి జోగి శ్రీదేవి ఫౌండేషన్ ఛైర్మన్ కోడూరు శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈనెల 12లోపు చిన్నారుల పేర్లను నమోదు చేయాలని సూచించారు.

ఆర్టీసీ డిపో తనిఖీ

ధర్మవరం, జూన్ 7: పట్టణంలోని ఆర్టీసీ డిపోను ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత డిపోలోని గ్యారేజీని, కార్గోను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్యారేజీ కార్మికులు బస్సు కండీషన్‌ను ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా చెక్‌చేయాలని సూచించారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు అందరు పాటుపడాలని పిలుపునిచ్చారు. తర్వాత ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్, డిపో మేనేజర్ సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.


డిపో ఆవరణలో మొక్కలు నాటుతున్న ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వరరావు

అంబరాన్నంటిన సంబరాలు



ఎన్టీఆర్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకుంటున్న నాయకులు

చిలమత్తూరు, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయాన్ని సొంతం చేసుకున్న సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. మండల కన్వీనర్ రంగారెడ్డి, నాయకులు నాగరాజుయాదవ్, లక్ష్మీనారాయణయాదవ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అక్కడే కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. దేమకేతేపల్లి అంజినప్ప, బేకరీ గంగాధర్, శ్రీదేవి, బయపరెడ్డి, బాలాజీ, తిప్పారెడ్డి, శ్రీనివాసరెడ్డి, విశ్వనాథరెడ్డి, గౌరీశంకర్, మీసేవ సూరి, గంగాధర్, వెంకటసుబ్బయ్య, రామప్ప, శివ పాల్గొన్నారు.

మోదీతోనే భారత్‌కు ప్రపంచ ఖ్యాతి: బీజేపీ



అంబేడ్కర్ సర్కిల్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు

హిందూపురం అర్బన్, జూన్ 7: మోదీతోనే భారతదేశానికి ప్రపంచ ఖ్యాతి లభించిందని బీజేపీ నాయకులు అన్నారు. వరుసగా మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టబోతున్న సందర్భంగా ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణం నడిబొడ్డు అంబేడ్కర్ సర్కిల్‌లో యువమోర్చా జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి అధ్యక్షతన మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రమేష్‌రెడ్డి, 11వ వార్డు కౌన్సిలర్ అంజలి, నాయకులు వరప్రసాద్, భాగ్యలక్ష్మీగౌడ్, అంజన్‌రెడ్డి, గోవిందరెడ్డి, నగేష్, నరసింహమూర్తి, హరినాథ్‌రెడ్డి, బాలగోపాల్, ఎర్రమంచి మారుతి, సంతోష్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, జనార్ధన్, సురేష్ అరుణ్, రవిశంఖర్, శివ, పట్టణ అధ్యక్షుడు జయకృష్ణ, దత్త, రమేష్, శ్రీనివాసులు, హనుమంతప్ప, నాగరాజు, రాముడు పాల్గొన్నారు.

పరిగిలో: ప్రధాని నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని పదవి చేపట్టనున్న సందర్భంగా మండల కేంద్రంలో బీజేపీ నాయకులు టపాసులు పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. మండల అధ్యక్షుడు బంగారు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఎంపీటీసీ చంద్రశేఖర్, భైరెడ్డి, వెంకటరెడ్డి, అంజినరెడ్డి, నాగేంద్ర, శంకరప్ప, విట్టాపల్లి నాగరాజు, సంత్, సంజీవమూర్తి, సాయి, మహేష్, భీమేష్, రామాంజి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

గోరంట్ల, జూన్ 7: దేశ ప్రధానిగా నరేంద్రమోదీ మూడోసారి ఎన్డీఏ కూటమి నిర్ణయించడం పట్ల గోరంట్లలో బీజేపీ నాయకులు శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద పార్టీ జెండాలు పట్టుకుని బాణసంచా పేల్చారు. ఈశ్వర్‌రెడ్డి, మేదర శ్రీనివాసులు, శంకర్‌రెడ్డి, పూల గంగాధర్, ముంతాజమ్మ, లక్ష్మీదేవి, బోయ లక్ష్మీనారాయణ, నాగరాజుయాదవ్, చలం, శంకర్, నరసింహులు, నరేష్, హరీష్, షబ్బీర్, ఆంజనేయులు, లక్ష్మీపతి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరు

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, గుండుమల



నేషనల్ హైవే అధికారులతో మాట్లాడుతున్న ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్, జూన్ 7: నియోజకవర్గంలో టీడీపీ అధికారంలోకి రావడంతోనే అభివృద్ధికి అధ్యం పడింది. శుక్రవారం విజయవాడలో నేషనల్ హైవే అధికారులను స్థానిక ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామిలు కలసి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరగా అందుకు అంగీకరించి మంజూరు చేశారని వారు తెలిపారు. పట్టణ సమీపంలోని వడ్రపాళ్యం నుంచి వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల వరకు రోడ్డు నిర్మాణానికి రూ.15కోట్లు మంజూరు చేసేందుకు అధికారులు అంగీకరించినట్లు వారు తెలిపారు. టీడీపీ హయాంలో నియోజకవర్గంలో వందల కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, మరోసారి అధికారంలోకి రావడంతో అభివృద్ధికి అడుగులు పడ్డాయని తెలిపారు.

చంద్రబాబు కోసం మహిళల పాదయాత్ర



పాదయాత్రగా బయలుదేరిన కంచిసముద్రం గ్రామస్థులు

లేపాక్షి, జూన్ 7: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే పాదయాత్ర చేస్తామని కంచిసముద్రం గ్రామస్థులు మొక్కుబడి చేసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అత్యధిక మెజార్టీతో విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో మొక్కు తీర్చుకోవడానికి పాదయాత్రగా శుక్రవారం కంచిసముద్రం నుంచి కొటిపి చౌడేశ్వరీదేవి ఆలయానికి బయలుదేరి వెళ్లారు. పాదయాత్రకు టీడీపీ నాయకులు రాష్ట్ర ఈడిగ సాధికారిక సమితి డైరెక్టర్ చంద్రశేఖర్ మద్దతు తెలిపి వారికి అన్ని సదుపాయాలు సమకూర్చారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

గోరంట్ల, జూన్ 7: పట్టణంలోని మండల కాంప్లెక్స్ వద్ద సర్వే 271లోని లేఅవుట్‌లో ఏర్పాటైన ఇళ్ల స్థలాలను కొంతమంది ఆక్రమించుకున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు తహసీల్దార్ అక్బల్ బాషాకు శుక్రవారం విన్నవించారు. జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సురేష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఆయనకు వినతిపత్రం అందించారు. కొంతమంది నకిలీ పట్టాలతో స్థలాలను కబ్జాచేసి నిర్మాణం చేపట్టారన్నారు. పేదలకు దక్కాల్సిన స్థలాలు స్థితిపరులు ఆక్రమించుకుని, ఎన్నికల ముందు అడిగేవారుండరని ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్నారు. అడ్డుచెప్పిన అధికారుల మాటలను ఖాతరు చేశారని, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు చేస్తామన్నారు. కోర్టులో ఉన్న స్థలాలు మినహా మిగిలిన ఆక్రమణలను పరిశీలించి వెంటనే వారికి నోటీసులు ఇవ్వాలని కోరారు. నాయకులు అనిల్‌కుమార్, రాఘవ, తిరుపాల్, శ్రీనివాసులు, శ్రీరాములు పాల్గొన్నారు.

మడకశిరలో భారీ వర్షం

● పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
● ఇళ్ల మధ్యలో నిలిచిన వర్షపు నీరు
● ఇబ్బందిపడ్డ ప్రజలు

మడకశిర రూరల్, జూన్ 7: మండలవ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో వంకలు,వాగులు పొంగిపొర్లాయి. చెక్‌డ్యాంలు నిండిపోయాయి. రైతులు, ప్రజలు హర్షం వ్యక్తంచేవారు. గోవిందాపురం, నీలకంఠాపురం, గుద్దిలపల్లి, జీవీ పాళ్యం, గుండుమల తదితర గ్రామాల్లోని వంకలు, వాగులు జోరుగా పారుతున్నాయి ఆ నీరు అంతా చెరువులకు చేరుతున్నాయి.

మడకశిర టౌన్: నియోజకవర్గ వ్యాప్తంగా వారం రోజుల నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. శుక్రవారం సాయంత్రం 4 గంటలకుపైగా వర్షం పడింది. దీంతో రహదారులపైకి నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇళ్ల మధ్యకు నీరు చేరాయి. వర్షం కురుస్తుండడంతో పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. 5 గంటలకు పైగా సరఫరా నిలిచిపోయింది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవడంతో చిన్న చిన్న వంకలు, వాగులు పొంగిపొర్లాయి. గురువారం రాత్రి అమరాపురం మండలంలో 48.4 మి.మీ వర్షం నమోదు అయింది. మడకశిరలో 9.6, గుడిబండలో 6.4, అగళిలో 10.2, రొళ్ళలో 2.2మి.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

పెనుకొండ రూరల్: మండల వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి వరకు ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లడంతో చెక్‌డ్యామ్‌లు, కుంటలకు నీరు చేరాయి. భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పెనుకొండ మండలంలో పలు గ్రామాల్లో రోడ్లపై వర్షపునీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

గుడిబండ: మండలంలోని మందలపల్లి, కొంకల్లు, ఎస్.రాయాపురం, పూజారిపల్లి, మేకలగట్టు, ఎస్ఎస్ గుండ్లు, సీసీగిరి, తదితర గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో వంకలు, వాగులు పొంగిపొర్లి కొంకల్లు చెరువుకు భారీగా నీరు చేరాయి. బోరుబావుల్లో నీటి మట్టం పెరిగిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.



మడకశిర మండలం గోవిందాపురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వంక

హిందూపురం అర్బన్: పట్టణంలో మూడు రోజులుగా సాయంత్రం అయిందంటే వర్షం కురుస్తోంది. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి వర్షం ఏకధాటిగా కురిసింది. జనవరి నుంచి జూన్ నెల ప్రారంభం వరకూ ఎండ వేడిమికి విలవిల్లాడిన ప్రజలు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఊరట లభించింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. చిన్న కుంటలు నీటితో నిండిపోయాయి. కాలువలు శుభ్రం చేయకపోవడంతో పలు చోట్ల మురుగు నీరు రోడ్లపైకి చేరాయి.

పెనుకొండ టౌన్: రెండురోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం రావడంతో సోమందేపల్లి మండలంలోని వెలిదడకల సమీపంలోని చెరువుకు భారీ నీరు చేరింది.



మడకశిరలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు



పెనుకొండ మండలం కోనాపురంలో కుంటలోకి చేరిన వర్షపునీరు



గుడిబండ మండలం కొంకల్లు చెరువులోకి చేరిన నీరు

పురంలో పారని పెద్దాయన పాచికలు..!

● బీసీ మహిళతో బరిలోకి...
● రెండు కులాల ఓట్లు గంపగుత్తగా పడతాయని ఎత్తుగడ
● తిప్పికొట్టిన ఓటర్లు

హిందూపురం, జూన్ 7: ఉమ్మడి రాష్ట్రంలోనే హిందూపురం వాణిజ్య కేంద్రానికి పెట్టిందిపేరు. దీంతోపాటు ఉమ్మడి జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధిలో కూడా మొదటి స్థానంలో ఉంది. దీంతోపాటు ఈ ప్రాంతంలో అపారమైన వనరులున్నాయి. ఎలాగైనా నియోజకవర్గాన్ని తన గుప్పెట్లో పెట్టుకోవాలని పెద్దాయన యోచించాడు. ఎన్నికలకు ఎనిమిది నెలల ముందు హిందూపురంలో వైసీపీ ఇన్‌చార్జిగా ఉన్న మహ్మద్ ఇక్బాల్‌ను తప్పించి బెంగళూరులో ఉన్న తన అనుచరుడి ద్వారా హిందూపురం మండలానికి చెందిన వేణురెడ్డి సతీమణి కురుబ దీపికను ఇన్‌చార్జిగా నియమించారు. అప్పటికే మూడు వర్గాలుగా ఉన్న వైసీపీ దీపికను ఇక్కడకు పంపగా అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు మంత్రి పెద్దిరెడ్డి తీవ్రంగా కృషిచేసినట్లు చెప్పవచ్చు. ఈ కారణంగా ఎన్నడూలేనివిధంగా వైసీపీలో ఈసారి అన్నివర్గాల నాయకులు పనిచేశారు. అయినా పెద్దారెడ్డి పాచికలు హిందూపురంలో పారలేదు. మండలంలోని పారిశ్రామిక వాడ ఉండి ఇక్కడ చిన్న, పెద్ద పరిశ్రమలు వందకుపైగా ఉన్నాయి. దీనికితోడు పురానికి పక్కనే పెన్నా, కుముద్వతి, జయమంగళి నదులు ఉన్నాయి. వీటిలో అపారమైన ఇసుక ఉంది. తాను చెప్పినవారు ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందితే ఈ వనరులు తన కబంధహస్తాల్లో ఉంచుకుని ఇసుక అక్రమ రవాణాతో లబ్ది పొందవచ్చని పెద్దాయన ఆశించినట్లు సమాచారం. మరీ ముఖ్యంగా హిందూపురం బెంగళూరుకు దగ్గరగా ఉండటంతో ఇక్కడ భూములధరలు రెట్టింపుస్థాయిలో పెరిగాయి. హిందూపురం ప్రాంతంలో వేలాది ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయి. వాటిపై కూడా కన్నేయవచ్చని ఆలోచనతో హిందూపురాన్ని తన కనుసన్నల్లో తీసుకొచ్చేందుకు విశ్వ ప్రయత్నం చేశారు.



బీసీ మహిళతో బరిలోకి...

హిందూపురం అసెంబ్లీ స్థానం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రధాన పార్టీలో మహిళా అభ్యర్థి బరిలో దిగలేదు. ఈసారి బాలకృష్ణ మీద పోటీకి దీపికను రంగంలోకి తీసుకొచ్చారు. ఎందుకంటే దీపిక కురుబ సామాజికవర్గానికి చెందినదికాగా ఆమె భర్త రెడ్డి సామాజికవర్గం దీంతో ఈరెండు కులాల ఓట్లు గంపగుత్తగా పడతాయని ఆశించారు. సొంత సర్వే సంస్థ అయిన ఐప్యాక్ ద్వారా సర్వే చేయించి దీపికను దింపినట్లు చెప్పుకుంటుంటారు. అంతేకాక కురుబల ఓట్లు ఆశించిన స్థాయిలో ఉన్నాయి. ఎలాగూ వైసీపీకి పడే ఓట్లు పడతాయి ఇక రెడ్డి కులానికి చెందిన ఓట్లు కూడా తమవైపు పడతాయని భావించి దీపికను దింపారు. కానీ బాలయ్య పురంలో హ్యాట్రిక్ కొట్టాలని నిశ్చయించుకుని బరిలో దిగారు. దీంతో వారి ఎత్తులు చిత్తయ్యాయి.

తిప్పికొట్టిన పురం ఓటర్లు

హిందూపురం నియోజకవర్గ పరిధిలో మూడోసారి నందమూరి బాలకృష్ణ బరిలోకి దిగాడు. 2014లో వచ్చిన ఓట్లకంటే 2019లో ఆధిక్యం పెరిగింది. 2024లో భారీ మెజార్టీ సాధించారు. దీనికారణంగా పెద్దిరెడ్డి వేసిన ప్లాన్ అట్టర్‌ఫ్లాప్ అయిందని చెప్పవచ్చు. పెద్దిరెడ్డి వేసిన పాచికలు తిరగబడ్డాయి. పురం ఓటర్లు బాలయ్యవైపే మొగ్గాయి. దీనికారణంగా 32,597ఓట్లు మెజార్టీ సాధించారు. మొత్తంగా చూస్తే మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఎన్ని ఎత్తుగడలువేసినా పురం ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి అభివృద్ధి చేసే ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు.

పంచాయతీల్లో పాలన అస్తవ్యస్తం

● అభివృద్ధికి నోచుకోని గ్రామాలు
● పట్టించుకోని అధికారులు

మడకశిర రూరల్, జూన్ 7: పంచాయతీల పరిపాలన చిన్నాభిన్నం అయ్యింది. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధిచెందుతుందని, అలాంటిది ఐదేళ్లుగా నాయకులు పట్టించుకోకాపోవడంతో గ్రామాలు అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచాయి. ప్రజలకు అందుబాటులో సచివాలయాలు ఏర్పాటుచేసినా వాటికి కావలసిన నిధులు విడుదల కాకపోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు అభివృద్ధి మాటే మారిచారని ప్రజలు వాపోతున్నారు. మండలంలో చాలా గ్రామాల్లో తాగునీటి సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నేటికి డ్రైనేజీలు, వీధి దీపాలు కూడా లేని పరిస్థితి నెలకొంది. పంచాయతీల అభివృద్ధికి విడుదల చేసిన నిధులు వైసీపీ ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించడంతో అభివృద్ధి కుంటుపడింది. విధిలేని పరిస్థితిల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా సర్పంచులు సొంత డబ్బుతో తాగునీటి సమస్యలు కొంతవరకు పరిష్కరిస్తున్నారు. టీడీపీ రాకతో గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందన్న ఆశాభావం ప్రజలు వ్యక్తంచేస్తున్నారు.



వైబీ హళ్లిలో రోడ్డుపైనే పారుతున్న మురుగునీరు

టీడీపీ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

రామాంజనేయులు, సర్పంచు వై.బి. హళ్ళి



తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో హయాంలో గ్రామాల్లో అభివృద్ధి బాగా జరిగింది. వైసీపీ ప్రభుత్వంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సర్పంచులు అధికారాలు లేక నిర్వీర్యం చేశారు. పంచాయతీలో ఉన్న నిధులు ఇతర పథకాలకు మళ్లించడంతో సర్పంచులు నామమాత్రంగా మిగిలిపోయారు. నిధులు లేక గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరిచడాని ఎంతో ఇబ్బందులు పడ్డాం. టీడీపీ రాకతో అభివృద్ధి జరుగుతుందన్న నమ్మకం ఉంది.

రాయితీ ధరలకు కందులు

చిలమత్తూరు, జూన్ 7: రాయితీ ధరలకు కందులను అందజేస్తున్నట్లు ఏఓ వంశీకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్‌లో కందిపంట సాగుచేసే రైతులకు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో శనివారం నుంచి ఎల్ఆర్‌జీ 52 రకం కందులను రాయితీ ధరలతో అందజేస్తున్నట్లు తెలిపారు. ఒక్కో రైతుకి 4 కిలోలు అందజేస్తామని, రాయితీ పోను రూ.391 చెల్లించాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు



ప్రతిభ కనబరచిన విద్యార్థులు

అగళి, జూన్ 7: స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు శుక్రవారం ముగిసినట్లు ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి బొజ్జేనాయక్ తెలిపారు. గ్రంథాలయంలోని పుస్తకాలను, న్యూస్‌పేపర్లను బాగా చదివి అర్థం చేసుకుని సమాజానికి ఉపయోగపడాలని విద్యార్థులకు సూచించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అసిస్టెంట్ చిన్న నాగప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలు..!

● రోజా 15 సార్లకుపైగా అంతరాయం
● మండిపడుతున్న ప్రజలు

హిందూపురం అర్బన్, జూన్ 7: అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక రోజు అంటే మరమ్మతులు ఉంటాయిలే అనుకోవచ్చు, వారం రోజులుగా ఉదయం నిద్ర నుంచి లేవకముందు నుంచే కరెంటు కోతలు ప్రారంభమౌతాయి. 10 నుంచి 15 సార్లు కరెంటు పోవడం కొంత సమయం తరువాత రావడం పరిపాటిగా మారింది. ఈ సమయంలో కరెంటు పోతుందని తెలిపితే కరెంటు ఉన్న సమయంలో పనులు చేసుకుంటామని అంటున్నారు. అలా కాకుండా ఎడా పెడా కోతలు విధిస్తుంటే ఇబ్బందిగా మారిందన్నారు. వారానికి ఒక రోజు మెయింటెనెన్స్ అంటూ ఉదయం నుంచి సాయంత్రం దాకా కరెంటు తీసేస్తున్నారు. దీనికి తోడు మరమ్మతులు పేరుతో విద్యుత్‌ను తీసేస్తున్నారు. సంబంధిత అధికారులను అడిగితే విద్యుత్ తీగలపై ఉడతలు సంచరించడం, పాములు, బల్లులు ట్రాన్స్‌ఫార్మర్‌లలోకి దూరడం వంటివి జరగడంతో సమస్యలు తలెత్తుతున్నాయని చెబుతున్నారు. ఇప్పుడు అవి కూడా జరుగలేదు. మరి ఎందుకు విద్యుత్ తరచూ పోతూ వస్తోందని ప్రశ్నిసే ట్రిప్ అవుతా ఉందని, వర్షాల కారణంగా విద్యుత్ ఆలస్యం అవుతోందని సమాధానమిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



రెండ్రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం: భూపతి, డీఈఈ, హిందూపురం

ఎండలు ఎక్కువగా ఉండటంతో ఇన్సులేటర్లు నెర్రలు బారాయి. వర్షాలు రావడంతో ఎర్రలు బారిన ఇన్సులేటర్లలో నీరు పోవడంతో అవి పగిలి పోతున్నాయి. దగ్గరా వెళ్లి గమనించినా అవి కనపడవు. వర్షాకాలం కావడంతో ఇబ్బందుల ఎదురవుతున్నాయి. ప్రస్తుతం పట్టణ ఫీడర్ నుంచి విద్యుత్ అందిస్తే బాగుంటుందని ఆలోచిస్తున్నాం. అలా తీసుకోవాలంటే రైల్వేట్రాక్ క్రాస్ చేయాల్సి ఉంది. రైల్వే అధికారులు అనుమతి కోసం కోసం ప్రయత్నిస్తున్నాం. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్రీనివాస్ గెలుపు



డీటీ శ్రీనివాస్‌ను అభినందిస్తున్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు

పావగడ, జూన్ 7: ఆగ్నేయ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి డీటీ శ్రీనివాస్ గెలుపొందారు. గురువారం మధ్యాహ్నం నుంచి ఓట్ల లెక్కింపు జరిగినప్పటికీ రాత్రివరకు శ్రీనివాస్ మొదటి, రెండో ప్రాధాన్యతలో ఆధిక్యంలో ఉండి శుక్రవారం వెలువడిన ఫలితాల్లో 12632ఓట్లు దక్కించుకున్నారు. బీజేపీ అభ్యర్థి వైఏ నారాయణ స్వామికి 7564 ఓట్లు వచ్చాయి. ఇండిపెండెంట్ అభ్యర్థి వినోద్‌శివరాజ్‌కు 6863 ఓట్లు లభించాయి. నారాయణపై శ్రీనివాస్ 5068ఓట్ల తేడాతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారి డిక్లరేషన్ ఫారం అందించారు. కర్ణాటక ఈశాన్య గ్రాడ్యుయేషన్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ బెంగళూరు గ్రాడ్యుయేషన్ కేంద్రం నుంచి రామోజీగౌడ, ఆగ్నేయ క్షేత్రం నుంచి శ్రీనివాస్ ముగ్గురు కాంగ్రెస్ నుంచి గెలుపొందగా నైరుతి ఉపాధ్యాయుల క్షేత్రం నుంచి ధనుంజయసర్జి బీజేపీ అభ్యర్థిగా దక్షిణ ఉపాధ్యాయ క్షేత్రం నుంచి శివకుమార్, బీజేపీ అభ్యర్థులు గెలుపొందారు. అలాగే నైరుతి ఉపాధ్యాయ క్షేత్రం నుంచి బోజేగౌడ జేడీఎస్ తరుపున గెలుపొందినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. వీరి గెలుపుపట్ల డీసీఎం డీకే శివకుమార్, ఏఐసీసీ కార్యదర్శి మయూర జయకుమార్, చిత్రదుర్గం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సుధాకర్, పావగడ ఎమ్మెల్యే వెంకటేష్, హిరియూరు మాజీ ఎమ్మెల్యే పూర్ణిమ తదితరులు శ్రీనివాస్‌ను అభినందించారు.

విద్యుదాఘాతంతో తండ్రీకొడుకులకు గాయాలు

గోరంట్ల, జూన్ 7: మండలంలోని చెట్లమరంపల్లికి చెందిన తండ్రీకొడుకులు వెంకటేష్, హర్షవర్ధన్ విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు హర్షవర్ధన్ ఇంటి సమీపంలోని ప్రాథమిక పాఠశాల వెనుక ఉన్న మైదానంలో శుక్రవారం బహిర్భూకి వెళ్లాడు. నేలపై పడి ఉన్న డిష్ వైరును బాలుడు పట్టుకోగా విద్యుత్ షాక్ తగిలింది. విలవిల్లాడుతున్న బాలుడిని రక్షించడానికి తండ్రి వెంకటేష్ ప్రయత్నించడంతో ఆయనకు కూడా విద్యుత్ షాక్ తగిలింది. స్థానికులు గుర్తించి వారిద్దరిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

అగ్ని ప్రమాదంలో వృద్ధురాలికి...

గోరంట్ల, జూన్ 7: మండలంలోని బూదిలి గ్రామానికి చెందిన రుక్సానా అనే వృద్ధులు ప్రమాదవశాత్తూ మంటల్లో పడి తీవ్రంగా గాయపడింది. ఇస్మాయిల్ భార్య రుక్సానా గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇంటిలో గురువారం చేరారు. శుక్రవారం ఇంటి పరిసర ప్రాంతంలో ఉన్న చెత్తను కుప్పగా వేసి ఆమె నిప్పుపెట్టారు. మంటలు ఎగిసిపడుతుండగా చెత్తను తోసే ప్రయత్నంలో అదుపుతప్పి మంటల్లో పడింది. కుటుంబ సభ్యులు గమనించి గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైనవైద్యం కోసం హిందూపురం ఆసుపత్రికి తీసుకువెళ్లాలని వైద్యులు సూచించారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి... ఒకరి మృతి

లేపాక్షి, జూన్ 7: ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం చిలమత్తూరు మండలం కనుమ లక్ష్మీనరసింహస్వామి ఆలయంవద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు చిలమత్తూరు మండలం కొర్లకుంట గ్రామానికి చెందిన షఫీ(48) లేపాక్షిలో సైకిల్‌షాప్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం చిలమత్తూరు నుంచి లేపాక్షివైపు వస్తుండగా ఆలయం వద్ద జింకలు అడ్డురావడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. వెంటనే 108 సాయంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. షఫీకి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిలమత్తూరు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు...

పెనుకొండ రూరల్, జూన్ 7: కర్ణాటకలోని బాగేపల్లి గ్రామ సమీపంలో 44వ జాతీయర హదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కురుబవాండ్లపల్లి గ్రామానికి చెందిన గాంధీ (30)అనే యువకుడు బెంగళూరు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ గురువారం అర్ధరాత్రి మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. గాంధీ, బూషప్ప కలిసి ద్విచక్రవాహనంలో వ్యాపారం నిమిత్తం పెనుకొండ నుంచి బాగేపల్లికి వెళ్లారు. తిరుగు ప్రయాణం అవ్వగా ఆదెప్పల్లి గ్రామంవద్దకు రాగానే ముందువెళ్తున్న లారీని ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు హుటాహుటిన బాగేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. గాంధీ పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరులోని ఆసుపత్రికి తరలించారు. గురువారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ గాంధీ మృతిచెందాడు. గాంధికి భార్య సాయి, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

చిలమత్తూరు, జూన్ 7: ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శివ శంకర్ సూచించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఓపీ సేవలపై ఆరా తీశారు. ఎటువంటి జబ్బులతో వస్తున్నారు? వారికి ఎలాంటి వైద్యం అందిస్తున్నారు అనే విషయాలను వైద్యాధికారి తేజశ్వినిని అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సీజనల్ వ్యాధులు ప్రబలే సమయం కావడంతో వాటి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రిలో ప్రసవాలపై ఆరాతీశారు. మందుల నిల్వలు, ఇతరత్రా అవసరాలపై చర్చించారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆసుపత్రి పరిపాలన విభాగానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సూపర్‌వైజర్ గోవిందప్ప, పీహెచ్ఎన్ లీలావతి పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివశంకర్